# వ్యర్థప్రయాస!

అవును! విమలనూ విశ్వబ్రహ్మాన్నీ వేరుచేసింది నేనే! అందులో నే నేమీ దగా చెయ్యలేదు. మొదట ఇద్దరికీ చెప్పి చూశాను! నలభై ఏళ్ల నుంచీ ప్రపంచం చూస్తున్నాను. నామాట వినమన్నాను. ఒకతె బాలవితంతువూ, రెండోవాడు విశ్వ బ్రాహ్మణ కుర్రాడూ, ఇద్దరికీ ఎట్లా పొత్తు కలుస్తుంది?

విశ్వబ్రహ్మం ఇక్కడ కాలేజీలో చదివి ఫస్టు మార్కులు తెచ్చుకుంటున్నాడని అక్కడ తండ్రి అనుకుంటున్నాడు. ఇక విమల తండ్రి సంగతి అడగనే అక్కర్లేదు - తన కుమార్తె పదహారోయేట కూడా చంటిపిల్ల అనే!

ఈ ఇద్దరూ రోజూ సాయంకాలంపూట బీచిలో కూర్చుని ప్రేమించుకుంటున్న సంగతి విమల తండ్రికీ, విశ్వబ్రహ్మం తండ్రికీ తప్ప మిగతా ప్రపంచానికంతకీ తెలుసు.

"నేను విశ్వబ్రాహ్మణ్నేమిటి? నాకు కులం లేదు. నేను విమలకు మల్లేనే మాట్లాడతాను, విమల తిన్న అన్నమే తింటాను. విమలే నా కులమూ, మతమూ, ప్రాణమూ, సమస్తమూనూ;" అని లెక్చరు దంచాడు విశ్వబ్రహ్మం.

"నేను వితంతువునేమిటి? నాకు పెళ్లే కాలేదు. నాకొక్కడే భర్త - విశ్వబ్రహ్మం!" అన్నది విమల. అజ్ఞానం వల్ల ద్విగుణితమైన సాహసంతో. విశ్వబ్రహ్మం తండ్రికి వెంటనే ఒక ఉత్తరం రాసిపారేసి విమల తండ్రికి ఒక చిన్న లెక్చరివ్వటం తప్ప నాకు గత్యంతరం లేకపోయింది.

ఆ ఇద్దరి బాలహృదయాలూ వేధించటం నాకు కష్టంగా ఉంది. ముందు రాబోయే పెద్ద బాధతో పోలిస్తే దానిస్థానే వచ్చిన ఈ చిన్న బాధ ఎంత? అది వాళ్లెరగరు.

ఒకరినొకరు మరిచిపోవటానికి ఒక వారం గడువిచ్చాను. విశ్వబ్రహ్మం స్థితి మరీ అన్యాయంగా ఉండటం చూసి వారం నెల చేశాను. విశ్వబ్రహ్మం తెప్పరిల్లుకోలేదు. విమల చిక్కి సగమైంది. కాని ఇద్దరూ ఒకరినొకరు చూసుకోటంలేదు.

సగం చచ్చిన ప్రాణుల్ని చూస్తే నాకు భయం. నడుము విరిగి ఎంతకూ ప్రాణం పోకుండా గిలగిలలాడే ఆ కుర్రాళ్ల ప్రేమ నడుము మీద మరో దెబ్బ వెయ్యక తప్పలేదు.

"చూశావా, విశ్వబ్రహ్మం?" అన్నాను. "విమల అప్పుడే నిన్ను మరిచిపోయింది. అప్పుడే ఆ కేశవరావుతో సినిమాలకు వెళుతున్నది, నేను చెప్పలా!"

విశ్వబ్రహ్మం అంత దైన్యంలోనూ ఆత్రంగా, "విమల వాణ్ని ప్రేమించదు. వాడిమీద పగతీర్చుకుంటుంది. అంతే! ఎట్లాగైనా ఆపాలి. మీరే ఆ పిల్ల హృదయం చితగపొడిచారు" అని లబలబలాడాడు. నేను లక్ష్యం చెయ్యలేదు.

"చూశావా, విమలా; విశ్వబ్రహ్మం పెళ్లాడడానికి పిల్లను చూడబోతున్నాడు. నేను చెప్పలా!" అన్నాను.

"అయ్యయ్యో! అతని మనసు మీరే విరిచారు. ఎవతె కొంపో నిలువునతీస్తాడు. ఎట్లాగైనా అతను పెళ్లాడకుండా ఆపాలి!"

తరవాత మూడు రోజులకు విమలా, విశ్వబ్రహ్మమూ కలిసి లేచిపోయినారు. పాండిచ్చేరి వెళ్లారని తెలిసింది.

చెప్పవచ్చిందేమంటే నా శ్రమంతా వృథా అయింది!

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***

***యువ కార్యాలయం, తెనాలి***